# అందని పువ్వు

రచన.
''భాస్కరశ్రీ''

[ఎత్తుగానున్న పూలమొక్కని ఒక పువ్వు వుంది. చాలా అందంగా చూపరులను ఆకర్షిస్తుంది, ఆమె కావాలంది. అతను కోయబోయాడు. కాని అది అందలేదు. అతను వూరుకోలేదు. దగ్గరలోనున్న ఒక కఱ్ఱతో ఆ పువ్వును కొట్టాడు. రేకలన్ని విడిపోయాయి. ఆకులతో సహా ఆ పువ్వు అంతిమదశలో నేలకూలింది. అతనికి అందని అది మరొకరిలేదు గదా అనే తృప్తి అన్నట్లు అతను నవ్వేడు ఇక చదవండి]

''ఏమండీ! ఏం పనిచేశారండి!'' నొచ్చుకుంటున్నట్లు, అంది ఆమె కోమలహృదయం గలది గాబట్టి,

''ఏమిటి లోకూ!'' అన్నాడతను.

''అదే! ఆ పువ్వు నెందుకలా కఱ్ఱతో కొట్టి, నాశనం చేశారు! అందకపోతే అలా వదిలెయ్య లేకపోయారా?''

''అదా! నువ్వుకోరావు! కొయ్యబోయాను. అందలేదు, అందం అందకపోతే చూస్తూ సహించగల హృదయం ఎవరికుంటుంది లోకూ!...''

''మీ మగవాళ్ళకి లేకపోయినా మా ఆడవాళ్ళకి వుంటుందండీ!...మీరు మీ(మగాళ్ళ) బుద్ధి చూపించుకున్నారు.'' నవ్వుతూనే అంది లోకేశ్వరి.

అందులో బాధించే విషయం ఏమీ లేదు. కాని అతనిముఖంలో రంగులు మారాయి. ఏవో ఆలోచనలు అతనికి మెదడులోరైళ్ళలా పరిగెత్తున్నాయి!

''ఏమిటండీ ఆలోచిస్తున్నారు!''

''అఁ...ఏమీలేదు అన్నాడు తొట్రుపాటుతో'' తనలోని మార్పు లెక్కడ గుర్తించిందో ననే భయంతో.

''ఇలా చూడండి! నాకు ఒకరి గాథగుర్తొచ్చింది...''

''ఏమిటి?''

''అదే! నాకో మిత్రురాలుండేది. ఆమె అందానికి ఆమేసాటి. కాని ఎప్పుడూ విచారంగా వుండేది. అందులోని రహస్యం నాకు అర్థంకాలేదు. అడగ్గా అడగ్గా ఆమె చివరికి తన విషాధగాథ చెప్పింది. తప్పుచేయక పోయినా అమె అనుభవించిన శిక్షకు కారణం ఒక మగవాడి ఓర్వలేనితనం! ఆ అందం తనకు దక్కలేదనే అసూయ! అసహనం!''

''సరిగ్గా చెప్పులోకూ! ఏమీ అర్థంగావటం లేదు!''

''ఆమె B. A. విశాఖపట్నంలో చదివేప్పుడు ఒకతను ఆమెతో వెరీ కొజ్ గావుండేవాడట. ఆమె కూడ అతన్ని ఒక సోదరునిగా చూసుకుని ఆదరించిందట. కాని ఆమె ప్రేమని అతను అపార్థం చేసుకొన్నాడట ఆమె అతని ఎడ తన ప్రేమ ఎలాంటిదో చెప్పివేసిందట, అప్పటినుండీ అతను ఆమెకు దూరంగా వుండేవాడట...''

''ఆగిపోయావేం! తర్వాత ఏమయింది'' అత్రుతగా ప్రశ్నించాడు.

''తర్వాత ఆమెకి M. A. చదివిన ఒక సంబంధం వచ్చిందట ఆమెకు అతను నచ్చాడట. అతనికికూడ ఆమె నచ్చిందట. సంబంధం స్థిరపర్చుకున్న తరువాత వరుడు తమ గ్రామం వెళ్ళిపోయాక 'అమ్మాయి కేరక్టర్ మంచిది గాదని తన ఒక మిత్రుడితో గాఢసంబంధం వుందని, ఇలా కళ్ళుకప్పి తనని మోసగించ దలచిన వారితో ఏనాడూ సంబంధ బాంధవ్యాలు కాంక్షించనని'' గ్రాసేశాడట. అతనికి నిజంచెప్పిన మిత్రుడి పేరు కూడ ఉదహరించాడట. ఆతనే ఆ అమ్మాయితో ముందు క్లోజ్‌గా వున్నాతను అట. అప్పటినుంచీ, వచ్చిన సంబంధాలు నచ్చక, జీవితంపై విరక్తి గలిగి బ్రహ్మచారిలా శుష్కజీవితం గడుపుతుంది ఆమె!...'' లోకేశ్వరి చెప్పటం ముగించి భర్తముఖంలోకి చూసింది. అతను మాత్రం యీలోకంలో లేడు. అతను మధ్యలోనే ఆమె మాటలు వినడం మానినట్లు ఆమెకు తెలీనే తెలీదు!

''ఏమండీ అలా వున్నారు?'' అంది.

''తలనొప్పిగా వుంది'' అనగానే ఆమె వేగంగా పార్కులోనుండి ఇంటికి తీసుకు వెళ్ళింది భర్తని. అమృతాంజనం తలకిరాసి ఎంతో ప్రేమతో సేవాశుశ్రూషలు చేసింది.

అతనికి లోకేశ్వరి చెప్పిన కథ అంతా తన స్వానుభవంలోని కథలాగే అనిపించింది: సరస్వతిని తను ప్రేమించాడు. ఆమె నిరాకరించింది: ఆమెకి తన మిత్రుడు బ్రహ్మానందం M. A. కి వివాహం కుదిరిందని తెలిసి బ్రహ్మానందాన్ని కలిశాడు. తనమాటమీద ఆనందంకి ఎంతో గురి. తనకు అందని ఆ అందం మరొకరికి అందటం చూసి సహించలేక పోయాడు. ఆసమయంలో ఏ పిశాచం తనని ఆవేశించిందో, లేనిపోనివన్నీ సరస్వతిమీద కల్పించిచెప్పి, ఆమె లావ్ లెటర్స్ మీద సంతకాలు ఫోర్జరీ చేసి లా లెటర్స్ సృష్టించి ఆనంద్‌కి చూపించాడు. వివాహం చెడింది. సరస్వతి స్వగ్రామం పోయింది తరువాత ఏం జరిగిందో తెలీదు.

ఇలా ఆలోచనలో లీనమయివుండగా పోష్టుమేన్ ''పోష్టు'' అన్న కేక వినిపించింది. ఇన్‌లాండ్ లెటర్ విప్పిచూశాడు. ఎక్కడో చూసిన రైటింగే! 'డియర్ లోకూ' అన్న సంభోధనబట్టి తన భార్యకి అనుకున్నాడు సంతకం చూశాడు 'సరస్వతి' ''ఏమండోయ్ నిన్న మీకు చెప్పింది ఈమె కథే.'' అన్న లోకేశ్వరిమాటలు అతనికి విన్పించలేదు.


కథాంజలి
[కథల మాసపత్రిక]
స్థాపితము 1938

| | |
|---|---|
| విడి ప్రతి, | — 25 పై. |
| సంవత్సర చందా | — రూ. 4-00 |

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గింబాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్స్‌లులోనూ దొరుకును.